క్లుప్తంగా

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నర్సాగౌడ్



మాక్లూర్: బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని గొట్టిముక్కల గ్రామానికి చెందిన నేమూరి నర్సాగౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు కులచారి దినేశ్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని జిల్లా కేంద్రంలో శనివారం అందుకున్నారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందుకు ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డికి నర్సాగౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు విశేష కృషి చేస్తానని పేర్కొన్నారు.

అబద్ధాల ఎంపీని నమ్మొద్దు

వేల్పూర్: స్వార్థ రాజకీయాల కోసం ప్రజలను మోసం చేస్తున్న ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను నమ్మొద్దని కిసాన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఏలేటి రాజేందర్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. గత ఎన్నికల్లో ఎంపీగా గెలిపిస్తే పసుపు బోర్డు ఏర్పాటు చేయిస్తానన్న అర్వింద్ జిల్లాలో ఎక్కడ చేయించాడో చూయిస్తే రైతులతో కలిసి సందర్శిస్తామని పేర్కొన్నారు. అబద్ధాలు చెబుతూ రైతులను మోసం చేస్తూ స్వగ్రామమైన వేల్పూర్ పరువును తీస్తున్నారని అన్నారు. గత ఎన్నికల్లో అబద్ధాలతో గెలిచారని, లేకుంటే డిపాజిట్ కూడా దక్కేది కాదన్నారు. బాండ్ పేపర్‌తో మోసం చేసిన ఎంపీకి ఈ ఎన్నికల్లో ఓట్లతో తగిన గుణపాఠం చెప్పేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

వడదెబ్బ తగలకుండా చూసుకోవాలి



రుద్రూర్: వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కోటగిరి మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ సూచించారు. పోతంగల్ మండలం కొడిచర్లలో శనివారం ఆరోగ్య కార్యకర్తలతో కలిసి పర్యటించారు. ఉపాధి హామీ కూలీలకు, పాఠశాల విద్యార్థులకు వడదెబ్బతో కలిగే నష్టాలు వివరిస్తూ అవగాహన కల్పించారు. ఎక్కువగా నీరు సేవించాలని, పలుచని ద్రవపదార్థాలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట హెల్త్ అసిస్టెంట్ శోభారాణి, ఆశావర్కర్ లింగామణి, అంగన్‌వాడీ టీచర్ సాయమ్మ తదితరులు ఉన్నారు.

ఈజీఎస్ పనుల పరిశీలన

కమ్మర్‌పల్లి: మండలంలోని నాగాపూర్‌లో ఉపాధి హామీ పనులను డీఆర్డీవో సాయాగౌడ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలకు అందుతున్న సౌకర్యాలపై ఆరాతీశారు. తాగునీటి సౌకర్యం, నీడ సదుపాయం తదితర సౌకర్యాల వివరాలను కూలీలపే అడిగి తెలుసుకున్నారు. అనంతరం కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. గ్రామంలోని వాటర్ ట్యాంకులను పరిశీలించారు. నీటి సరఫరా ఎలా ఉందని జీపీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీడీవో రాజశ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

గ్రామ బహిష్కరణపై ఫిర్యాదు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలంలోని పిప్రి గ్రామ వీడీసీ మాజీ ఎంపీటీసీని గ్రామం నుంచి బహిష్కరించినట్లు తెలిసింది. ఎంపీటీసీతో గ్రామానికి చెందిన మరో వ్యక్తికి భూవివాదం తలెత్తగా, ఆయన వీడీసీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. వీడీసీ సభ్యులు మాజీ ఎంపీటీసీకి జరిమానాతోపాటు గ్రామబహిష్కరణ ఆంక్షలు విధించడంతో ఆయన పోలీసులను ఆశ్రయించినట్లు తెలిసింది. పోలీసుల శనివారం ఇరువర్గాలను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి మాట్లాడినట్లు సమాచారం.

చట్టాలపై అవగాహన అవసరం

బోధన్: శాంతి భద్రతల రక్షణకు క్షేత్ర స్థాయిలో విధులు నిర్వర్తించే పోలీస్, ఎక్సైజ్, ఫారెస్ట్ శాఖ అధికారులు కొత్తగా వచ్చిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని బోధన్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిదిరాల రాణి, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు శ్యాంరావు, డాక్టర్ సమ్మయ్య సూచించారు. రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి ఆదేశాల మేరకు పట్టణ కేంద్రంలోని కోర్టు ప్రాంగణంలో డివిజన్ స్థాయి పోలీస్, ఎక్సైజ్, ఫారెస్టు డిపార్టుమెంట్ అధికారులకు చట్టాలపై శనివారం శిక్షణా తరగతులు నిర్వహించారు. సీఐలు ఎస్. వీరయ్య, కోలా నరేశ్, జయేష్‌రెడ్డి, ఎస్సైలు వంశీ కృష్ణ, అప్పారావు, సాయన్న, కృష్ణమూర్తి, వర్ని ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కె. బాబు, ఎక్సైజ్ ఎస్సై ఎండీ జలీలుద్దీన్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

బాల్కొండ: అగ్ని ప్రమదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బాల్కొండ ఫైర్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ శేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల పాఠశాలలో విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తాలను గురించి వివరించారు. ర్యక్రమమంలో ప్రిన్సిపాల్ హైమావతి, సిబ్బంది పాల్గొన్నారు.

అసలు ఏది నిజం..!

- బాల్కొండలో భూ కబ్జా వివాదం
- రోడ్డెక్కుతున్న భవానీ కాలనీ వాసులు
- లే అవుట్‌లో జీపీ అధికారుల లీలలు



జీపీ ఆవరణలో బైఠాయించిన కాలనీవాసులు



లే అవుట్‌లో పది శాతం వదిలిన భూమి

బాల్కొండ: భూకబ్జాలకు మండల కేంద్రం అడ్డాగా మారింది. కొందరు అక్రమార్కులు అధికారులను మచ్చిక చేసుకొని జీపీకి వదిలిన పది శాతం భూములను కబ్జా చేస్తున్నారు. మండల కేంద్రంలోని భవానీ కాలనీలో గ్రామ పంచాయతీకి కేటాయించిన స్థలంలో ఇతరులు ఇంటి నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నించడంపై కాలనీవాసులు పోలీస్‌స్టేషన్, గ్రామ పంచాయతీల ఎదుట నిరసన తెలుపుతున్నారు.

మండల కేంద్రంలోని సర్వే నంబరు 1402లో ఉన్న రెండు ఎకరాల 18 గుంటల స్థలంలో ఆ స్థల యజమాని 2001లో లే అవుట్ ఏర్పాటు చేసి 53 ప్లాట్లను ఏర్పాటు చేశారు. లే అవుట్‌లో ఎల్‌పీ నంబరు, జీపీ అనుమతి రావాలన్నా నిబంధనల ప్రకారం గ్రామ పంచాయతీకి 10 శాతం భూమిని కేటాయించాలి. అలా వదిలిన లేఅవుట్‌కు ఎల్‌పీ నంబరు 141 12001గా అధికారులు కేటాయించారు. లే అవుట్‌లో స్థలం వదలంతో గ్రామస్తులు ఆ వెంచర్‌లో ప్లాట్లను కొనుగోలు చేశారు. ఇదిలా ఉండగా వెంచర్ ఏర్పాటు చేసిన భూయజమాని మరణించారు. తర్వాత ఆయన కుటుంబీకులు జీపీకి వదిలిన 10 శాతం భూమిని వారిపైన రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఆ పది శాతం భూమిని ఇద్దరికి 2018లో విక్రయించారు. దీంతో ఆ పది శాతం భూమికి ఇద్దరు యజమానులు ఏర్పడ్డారు. ఆ సమయంలోనే పెద్ద దుమారం రేగింది. కానీ ఈ ఇద్దరులో ఒకరు మండల కేంద్రంలోని జీపీ పాలకవర్గంలో ద్వితీయ స్థానంలో ఉన్న వ్యక్తికి విక్రయించాడు. దీంతో నాటి అధికార పార్టీ నాయకుడు కావడంతో అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. అంతే కాకుండా ఆ నేత ప్రభావంతో విక్రయించిన వ్యక్తికి ఇంటి నిర్మాణానికి జీపీ నుంచి అనుమతి కూడా ఇప్పించాడు. జీపీ భూమిలో గ్రామ పంచాయతీ నుంచే నిర్మాణానికి అనుమతి లభించింది. దీంతో కొనుగోలు చేసిన వారు కోర్టును ఆశ్రయించారు. అనుమతిచ్చిన జీపీనే మళ్లీ పనులను అడ్డగిస్తుందని కోర్టుకెక్కడంతో కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చింది. ప్రస్తుతం ఆ ఆర్డర్‌ను చూపుతూ జీపీకి కేటాయించినట్లు చెబుతున్న స్థలం తమదే అంటున్నారు. పోలీసులు, అధికారులు సైతం ఆ భూమి కొనుగోలు దారులకే మద్దతు పలుకుతున్నారు. ఇతరుల పేరుపై రిజిష్టర్

సర్వే నంబరు 1402లో ఉన్న రెండుఎకరాల 18 గుంటల భూమిలో లే అవుట్ చేయడం నిజమైతే జీపీకి 10 శాతం భూమి ఉండటం కూడా నిజమవుతుంది. అసలు లే అవుట్ అక్రమ లేవుట్ అయితే ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి జీపీ నుంచి అనుమతులు లభించే అవకాశం లేదు. జీపీకి 10 శాతం భూమి కేటాయించకుండా లే అవుట్, ఎల్‌పీ నంబరు ఇచ్చే అవకాశం లేదు. ప్లాట్లు ఏర్పాటు చేసిన వ్యక్తి మరణించిన 18 ఏళ్ల తర్వాత ఇతరుల పేరున భూమి రిజిష్టర్ కావడం వెనుక రహస్యం ఏంటో అర్థం కావడం లేదు. అధికారులు మాముళ్లకు అలవాటు కబ్జాదారులకు అండగా నిలుస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వివాదాస్పద భూమి పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

బాల్కొండ: మండల కేంద్రంలోని సర్వే నంబరు 1402లో ఏర్పాటు చేసిన లేఅవుట్ ప్లాట్లలో పది శాతం భూమిని కబ్జా చేస్తున్నారని స్థానిక భవానీ కాలనీ వాసులు ఫిర్యాదు చేయడంతో డీఎల్‌పీవో శివకృష్ణ శనివారం పరిశీలించారు. వివాదాస్పదంగా ఉన్న స్థలం కోర్టు పరిధిలో ఉండటంతో ఎవరూ ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని అన్నారు. ఇంటి నిర్మాణాలకు అనుమతిచ్చిన వారిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఈవో రజనీకాంత్‌రెడ్డి, కాలనీవాసులు ఉన్నారు.

అంతా గందరగోళంగా ఉంది

సర్వే నంబరు 1402లో ఉన్న భూమిలో ఏర్పాటు చేసిన లే అవుట్ వెంచర్ పరిస్థితి అంతా గందర గోళంగా మారింది. గతంలో లే అవుట్ చేసిన సమయంలో జీపీ 10 శాతం భూమిని జీపీపై రిజిస్ట్రేషన్ చేసి ఉంటే ఇలాంటి సమస్య ఉండేది కాదు. కానీ అప్పట్లో అలా చేయలేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– రజనీకాంత్‌రెడ్డి, జీపీ కార్యదర్శి, బాల్కొండ

బాధిత కుటుంబాలకు పరామర్శ



కమ్మర్‌పల్లిలో పరామర్శిస్తున్న ఎంపీ అర్వింద్



నందిపేటలో పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

కమ్మర్‌పల్లి/ నందిపేట్/ మాక్లూర్/ డొంకేశ్వర్: కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన పన్నాల సుబ్బయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబీకులను ఎంపీ అర్వింద్ శనివారం పరామర్శించారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, నాయకులు మోహన్, కట్ట సంజీవ్, గంగారాం, ప్రవీణ్, గంగాధర్ తదితరులు ఉన్నారు. నందిపేట్ మండల కేంద్రంలో పలు బాధిత కుటుంబాలను ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు భూతం సాయిరెడ్డి, ఎంపీటీసీ రాజు, సాయికుమార్, నాగ సురేశ్, కస్తూరి గంగాధర్, చిన్నారెడ్డి తదితరులు ఉన్నారు. మాక్లూర్ మండలంలోని పలు గ్రామాల్లో మృతి చెందిన బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు పీర్ సింగ్, ముప్పా గంగారెడ్డి తదితరులు ఉన్నారు. డొంకేశ్వర్ మండలంలో ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి శనివారం పర్యటించి పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పోలింగ్ ప్రక్రియ పటిష్టంగా నిర్వహించాలి

బోధన్: లోక్ సభ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సజావుగా కొనసాగేలా పటిష్టంగా నిర్వహించేందుకు ఓపీవోలు పీవోలకు సంపూర్ణంగా సహకరించాలని ఎన్నికల జిల్లా మాస్టర్ ట్రెయినర్, ఎడపల్లి ఎంపీడీవో గోపాలకృష్ణ అన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధి లోని బోధన్ నియోజకవర్గ స్థాయి ఎన్నికల ఓపీవోలకు విధులు, బాధ్యతలపై శనివారం పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పోలింగ్ రోజుకు ముందు, ఆ తర్వాత నిర్వర్తించాల్సిన విధులను వివరించారు. సమావేశంలో బోధన్ తహసీల్దార్ గంగాధర్, ఎన్నికల ట్రెయినర్స్ అజీముద్దీన్, సూర్యకుమార్, ఓపీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

పోటీ పరీక్షల్లో సత్తా చాటేలా చూడాలి

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్: ఉన్నత విద్యార్హత పోటీ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటేలా విద్యా సంస్థలు కృషి చేయాలని బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి సూచించారు. పాఠశాల దశ నుంచే విద్యార్థులు చదువుల్లో పోటీతత్వం అలవర్చుకునేలా దృష్టి సారించాలని పేర్కొన్నారు. పోటీ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి బోధన్ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఇటీవల హైదరాబాద్‌కు చెందిన మై చాంప్స్ ఇండియా సంస్థ జాతీయ స్థాయిలో గణితం, సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో జాతీయ స్థాయి ప్రతిభా పోటీలు నిర్వహించింది. పోటీల్లో పాల్గొన్న పట్టణ కేంద్రంలోని విజయ సాయి హైస్కూల్ విద్యార్థులు లోకేష్ పాటిల్, సీహెచ్ కీర్తన ప్రతిభ చాటి ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచారు. శనివారం పాఠశాలలో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి విద్యార్థులకు సంస్థ అందించిన జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలతో పాటు ట్యాబ్, ల్యాప్‌టాప్‌లను అందించి అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణ మోహన్, మేనేజర్ ఐఆర్ చక్రవర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు



ఎడపల్లిలో జెండాను ఎగురవేస్తున్న మోహన్‌రెడ్డి



నవీపేటలో జెండాను ఎగురవేస్తున్న నాయకులు



అంకాపూర్‌లో బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

సాక్షి, నెట్‌వర్క్: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో బీజేపీ ఆవిర్భావ వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో నిర్వహించి పార్టీ ఆవిర్భావ వేడుకలను ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. కార్యకర్తల కృషితోనే బీజేపీ ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీ విస్తరించిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం బీజేపీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ నాయకులతో కలిసి టిఫిన్ బైఠక్ కార్యక్రమాన్ని చేపట్టారు. డొంకేశ్వర్‌లో పార్టీ మండల అధ్యక్షులు పోతుగంటి సురేందర్, మారంపల్లిలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధర్ పార్టీ జెండాలను ఎగురవేశారు. మోర్తాడ్, ఏర్గట్ల మండల కేంద్రాల్లో బీజేపీ జెండాలను మండలాల అధ్యక్షులు పుప్పాల నరేష్, ఏలేటి నారాయణరెడ్డి ఎగురవేశారు. ఎడపల్లి, జానకంపేట్ గ్రామాల్లో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డీ మోహన్‌రెడ్డి, నవీపేటలో పార్టీ మండల అధ్యక్షుడు ద్యాగ సరిన్, బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండల కేంద్రాల్లో పార్టీ మండలాల అధ్యక్షులు నవీన్, సంతోష్‌రెడ్డి, కోమన్‌పల్లి సాయన్న పార్టీ జెండాలను ఎగురవేశారు. ఆర్మూర్ పట్టణంలోని శివాజీ చౌక్‌లో, ఆలూర్, కోటగిరి, రుద్రూర్ మండల కేంద్రాల్లో బీజేపీ ఆవిర్భావ వేడుకలను పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ వ్యవస్థాపకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు పాల్గొన్నారు. రుద్రూర్‌లో పార్టీ నాయకులు టిఫిన్ బైఠక్ నిర్వహించారు. మెండోరా మండలం పోచంపాడ్‌లో ఉన్న పీహెచ్‌లో బీజేపీ నాయకులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు.



అంకాపూర్‌లో టిఫిన్ బైఠక్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే



రుద్రూర్‌లో టిఫిన్ బైఠక్‌లో నాయకులు



డొంకేశ్వర్‌లో జెండా ఎగురవేస్తున్న నాయకులు



మోర్తాడ్‌లో..



ముప్కాల్‌లో..



ఆర్మూర్ శివాజీచౌక్‌లో..



కోటగిరిలో..



పోచంపాడ్‌లో పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

తాగునీటి సమస్యలు రాకుండా చూడాలి



కమ్మర్‌పల్లిలో మాట్లాడుతున్న డీఆర్డీవో సాయాగౌడ్

- డీఆర్డీవో సాయాగౌడ్

కమ్మర్‌పల్లి: వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా చూడాలని డీఆర్డీవో సాయాగౌడ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీల కార్యదర్శులు, ప్రత్యేకాధికారులతో తాగునీటిపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. తాగునీటి సమస్యలు తలెత్తిన వెంటనే తక్షణం చర్యలు తీసుకోవాలని సూచించారు. లీకేజీలు సత్వరం సరి చేసి ప్రజలకు నీటిని అందించాలన్నారు. గ్రామాల్లోని ట్యాంకుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో రాజశ్రీనివాస్, తహసీల్దార్ ఆంజనేయులు పాల్గొన్నారు.

ముప్కాల్ మండలంలో..

బాల్కొండ: పల్లెల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ముప్కాల్ మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసులు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ముజాఫరొద్దీన్, తహసీల్దార్ వనజరాణితో కలిసి పంచాయతీ కార్యదర్శులతో శనివారం సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా మినరల్ వాటర్ సౌకర్యం కల్పించాలన్నారు. నీటి వృథాను అరికట్టాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీవో భరత్‌చంద్ర, ఆర్‌ఐ గంగాధర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రుద్రూర్‌లో..

రుద్రూర్: వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి శశికళ ఆదేశించారు. మండలంలోని బొప్పాపూర్, రుద్రూర్‌లో శనివారం వాటర్ ట్యాంకులను, నీటి వనరులను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ ప్రత్యేకాధికారులు, కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో సురేశ్‌బాబు, ఎంపీవో సాయిలు తదితరులు పాల్గొన్నారు.

కోటగిరిలో ..

నీటి సమస్యపై ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు ఫిర్యాదులు వస్తే సంబంధిత గ్రామ కార్యదర్శి బాధ్యత వహించాల్సి ఉంటుందని మండల ప్రత్యేకాధికారి సాయిబాబా హెచ్చరించారు. కోటగిరి ఎంపీడీవో కార్యాలయంలో తాగునీటిపై ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీవో మనోహర్‌రెడ్డి, ఎంపీవో మారుతి, జీపీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

బోధన్‌లో..

బోధన్‌రూరల్: సాలూర, బోధన్ మండలాల్లోని అన్ని జీపీల్లో వేసవికాలం దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యలు లేకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని బోధన్, సాలూర మండలాల ప్రత్యేకాధికారులు ఉదయ్ కుమార్, కృష్ణవేణి అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో జీపీ కార్యదర్శులు, గ్రామాల ప్రత్యేకాధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో తాగునీరు, నీటి వృథాను అరికట్టడంపై చర్చించారు. సమావేశంలో ఎంపీడీవో వెంకటేశ్ జాదవ్, ఏపీవో మధుకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీలను నెరవేర్చాలని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బాల్కొండ, వేల్పూర్, మెండోరా, ముప్కాల్ మండలాల రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రైతు పోరుబాట కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చి వరికి క్వింటాలుకు రూ.500 బోనస్, పంట నష్టపోయిన రైతులకు రూ.25 వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పసుపుబోర్డు సాధించానని చెబుతున్న ఎంపీ అర్వింద్ ఆ పసుపుబోర్డు ఆఫీస్ ఎక్కడుందో అందులో నీ కుర్చీ, నా కుర్చీ చూయిస్తావా అని ప్రశ్నించారు. పసుపు ధర పెరగగానే మా ఘనత అని చెప్పుకుంటున్న బీజేపీ ఇప్పుడు రూ. 5 వేల ధరకు ఎందుకు తగ్గిందో సమాధానం చెప్పాలన్నారు. నన్ను నమ్మి గెలిపించిన ప్రజల కోసం ఎప్పుడూ ముందుంటానని అన్నారు. కార్యక్రమంలో రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (3డీ–తెలుగు) – 11.20, 4.45, 10.10 భరతనాట్యం – 2.00, 7.25
స్క్రీన్-2 –	టిల్లు స్క్వేర్ (తెలుగు) – 10.20, 1.20, 4.20, 7.20, 10.20
స్క్రీన్-3 –	ది ఫ్యామిలీ స్టార్(తెలుగు) – 11.25, 2.50, 6.15, 9.40
స్క్రీన్-4 –	ది ఫ్యామిలీ స్టార్(తెలుగు) – 11.25, 2.50, 6.15, 9.40

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



రెంజల్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఐకేపీ సిబ్బంది

రెంజల్: ఐకేపీ ఆధ్వర్యంలో మండలంలోని బోర్గం, అంబేడ్కర్‌నగర్, రెంజల్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి, ఏపీఎం చిన్నయ్య రైతులతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని సూచించారు. కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు రాకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమాల్లో సీసీలు కృష్ణ, భాస్కర్, రాజయ్య, శ్యామల, రైతులు పాల్గొన్నారు.